
TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 238 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ బుధవారం.25.03.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD




# దక్షిణాది రాష్ట్రాలు పోరాటానికి సిద్ధం కావాలి




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: నియోజకవర్గాల పునర్విభజనలో తీవ్ర అన్యాయం జరుగుతున్న నేపథ్యం లో దక్షిణాది రాష్ట్రాలు పోరాటానికి సిద్ధం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఢిల్లీలో ఒక ప్రయివేటు టీవీ ఛానల్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పుడు ఎంపీ స్థానాల్లో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య ఎంత అంతరం ఉందో అంతే స్థాయిలో సీట్ల పెంపు జరగాలని డిమాండ్ చేశారు. 50 శాతం సీట్ల పెంపు అనేది ఫైనల్ బుల్లెట్ అనీ, ఏ లెక్క ప్రకారం ఆ పెంపు జరుగుతున్నదని ప్రశ్నించారు. ఇప్పటికే కేంద్రంలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తక్కువగా ఉందని తెలిపారు. మోడీ అధికారంలోకి వచ్చాక బీజేపీ అగ్రనేత వెంకయ్యనాయుడిని ఢిల్లీ నుంచి ఖాళీ చేయించారని గుర్తుచేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్ల పెంపుతో దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకునే అవకాశం ఉ ంటుందన్నారు. అలాగైతే జాతీయ రాజకీయాల్లో దక్షిణాది రాష్ట్రాల నేతలకు చోటు లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా లెక్కల ఆధారంగా సీట్ల పెంపు జరిగినా దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. అన్ని పక్షాలతో చర్చ జరిపి సీట్ల పెంపుపై ముందుకెళ్లాలని సూచించారు. మొదటి నుంచీ దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపుతున్నదనీ, ఉత్తర, దక్షిణ భారతాలకి మధ్య అంతరాన్ని ఎన్డీఏ ప్రభుత్వం పెంచుతున్నదని విమర్శించారు.

దక్షిణాది రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. తాను ఇంకా ఎనిమిదేండ్లు తెలంగాణ రాజకీయాల్లో ఉంటానని సీఎం చెప్పారు. తాను దేశ రాజకీయాల్లో పనిచేయాలా? వద్దా? అనేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందని వ్యాఖ్యానించారు. మోడీ త్రీడీ పాలసీకి వ్యతిరేకంగా దక్షిణాదిని ఐక్యం చేయాల్సిన అవసరముందని నొక్కి చెప్పారు. దక్షిణాది నుంచి ఎన్నికైన వారికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. మొదటి నుంచీ బీజేపీలో ఉన్నవారిని పక్కకు ఎందుకు పెట్టారని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు దక్షిణాది నేతలు రాష్ట్రపతులు అయ్యారని గుర్తుచేశారు. తమ పార్టీది ఇండియా అంతా ఒక్కటే అనే సిద్ధాంతం అని చెప్పారు. కానీ, మోడీ అధికారంలోకి వచ్చిన 12 ఏండ్లలో దక్షిణాదికి గుర్తింపు ఏదని ప్రశ్నించారు. రాజకీయ వివక్ష కొనసాగించడం బీజేపీకి వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కేంద్ర మంత్రిత్వ శాఖల్లో, టాప్‌టెన్ పదవుల్లో ఒక్కటి కూడా దక్షిణాది నేతలకు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. తమ నేత రాహుల్‌గాంధీ దేశం గురించి ఆలోచిస్తుంటే మోడీ, అమిత్‌షా అందుకు భిన్నంగా ప్రజలపై భారాలు మోపడంపై ఆలోచిస్తున్నారని ఎద్దేవా చేశారు. నిర్ణయాలు తీసుకున్న తర్వాత అన్ని పార్టీలనూ పిలవటం బీజేపీకి ఆనవాయితీగా మారిందని విమర్శించారు.

పెట్టుబడులన్నింటినీ ప్రధాని మోడీ గుజరాత్‌కు తరలిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ కూడా ఈ దేశంలో భాగమేననే విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. మంచి ఎక్కడ ఉన్నా స్వీకరిస్తామన్నారు. గుజరాత్‌లో సబర్మతీ నదిని ప్రక్షాళన చేసిన బీజేపీ హైదరాబాద్‌లో మాత్రం మూసీ ప్రక్షాళనను అడ్డుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ కూడా బీజేపీ బాటలోనే నడుస్తున్నదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన నాటికే రాష్ట్రంలో అప్పులు విపరీతంగా పెరిగి ఖజానా ఖాళీ అయ్యిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే, అసెంబ్లీలో దీనిపై శ్వేతపత్రం విడుదల చేశామని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలకులు 11.90 శాతం వడ్డీకి రెండు లక్షల కోట్ల రూపాయలు అప్పులు తీసుకున్నారని గుర్తుచేశారు. మాజీ సీఎం కేసీఆర్ నచ్చితే నజరానా, లేదంటే జరిమానా అనే విధంగా ప్రజల పట్ల వ్యవహరించారని విమర్శించారు. కేసీఆర్‌తో తనకు వ్యక్తిగతంగా సమస్యలేమీ లేవనీ, ఆయన తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధినేత సమర్థవంతమైన ప్రతిపక్ష నాయకుని పాత్రని పోషించాలని ఆకాంక్షించారు. తమకు 2034 వరకు ప్రజలు అవకాశం ఇస్తారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. భారత విదేశాంగ విధానం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తం చేశారు. మన చుట్టూ ఉన్న ఏ ఒక్క దేశంతో కూడా భారత్‌కు సత్సంబంధాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపి విద్యార్థులను తీసుకొచ్చినట్టే ఇప్పుడు అమెరికా, ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధాన్ని ఆపి చమురును తీసుకురావొచ్చుగదా అంటూ మోడీని ఎద్దేవా చేశారు. దేశంలో గ్యాస్, పెట్రోల్ కొరత ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దేశ ప్రధానిగా మోడీకి అండగా ఉంటామన్నారు. అయితే, ఆయన యాక్షన్ ప్లాన్ ఏంటో ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. ట్రంప్‌నకు భారత ప్రధానిగా మోడీ ఫోన్ చేసి ప్రస్తుత యుద్ధ వాతావరణాన్ని నివారించాలని విజ్ఞప్తి చేశారు.

# పటేల్ స్ఫూర్తితో ఆర్ఎస్ఎస్‌ను నిషేధిస్తారా?

హైదరాబాద్ అమృత్ తెలంగాణ: సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆర్ఎస్ఎస్‌ను నిషేధిస్తారా?అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బీజేపీని ప్రశ్నించారు. గుజరాత్‌లో పటేల్ విగ్రహం పెట్టడం సంతోషకరమనీ, దాంతోపా టు ఆయన ఆదర్శాలను కూడా పాటించాలని డిమాండ్ చేశారు. ఆయన విగ్రహం పెడతారు తప్ప ఆయన చేసిన పనులను మాత్రం అమలు చేయబోరని అన్నారు. మంగళవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా భట్టి పలువురు సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నీరుగార్చిందని విమర్శించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చిందన్నారు. ఇది పేద ప్రజలను చీటింగ్ చేయడం కాదా?అని ప్రశ్నించారు.

గాంధీని భౌతికంగా బతకనీయలేదనీ, ఆయన పేరు కూడా లేకుండా చేశారని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించా లని డిమాండ్ చేశారు. 1950 నుంచి 2014 వరకు 13 మంది ప్రధాన మంత్రులు రూ.56.66 లక్షల కోట్ల అప్పు తెచ్చారని వివరించారు. 2014 నుంచి ఈ 12 ఏండ్లలో ప్రధాని మోడీ రూ.140 లక్షల కోట్ల అప్పు తెచ్చారని చెప్పారు. అంటే ఏడాదికి సగటున రూ.11 లక్షల కోట్లు అప్పు చేశారని వివరించారు. దీంతో భారత్ అప్పు ప్రస్తుతం రూ.197 లక్షల కోట్లకు చేరిందన్నారు. రాష్ట్రాల నుంచి పన్నులు వెళ్తేనే కేంద్రం వద్ద నిధులుంటాయని అన్నారు. తెలంగాణ నుంచి కేంద్రానికి రూపాయి వెళ్తే తిరిగి 30 పైసలు మాత్రమే వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అందరం కలిసి కేంద్రంపై పోరాడాలన్నారు. రూపాయిలో కర్నాటకకు 15 పైసలు, ఏపీకి 62 పైసలు, తమిళనాడుకు 26 పైసలు, కేరళకు 60 పైసలు వస్తున్నాయని వివరించారు. కానీ బీహార్‌కు రూ.6.69 పైసలు, ఉత్తరప్రదేశ్‌కు రూ.1.96 పైసలు, మధ్యప్రదేశ్‌కు రూ.1.87 పైసలు, రాజస్థాన్‌కు రూ.1.19 పైసలు వెళ్తున్నాయని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలు, తెలంగాణ ఏం పాపం చేశాయని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

కేంద్రానికి రూపాయి కడితే రూపాయి తిరిగి ఇచ్చేలా ఒత్తిడి తేవాలని చెప్పారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందకుండా మోడీ ప్రకటించిన వికసిత్ భారత్ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యమని మోడీ ప్రకటించారని గుర్తు చేశారు. అందులో భాగంగానే తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా నిర్దేశించుకున్నామని వివరించారు. ఎవరెన్ని ఆరోపణలు చేసినా, అవమానాలు చేసినా క్యూర్, ప్యూర్, రేర్ ప్రణాళికలతో తెలంగాణ అభివృద్ధి ఆగేది లేదన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతోపాటు రాజీవ్ యువ వికాసం వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేస్తామని చెప్పారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను ప్రస్తుతం నెలకు రూ.700 కోట్లు చెల్లిస్తున్నామని అన్నారు. ఇక నుంచి రూ.వెయ్యి కోట్లు చెల్లిస్తామని చెప్పారు. మహిళలకు వడ్డీలేని రుణాలు రూ.లక్ష కోట్లు ఇస్తామన్నారు. విద్యుత్ సబ్సిడీలు ఎత్తేయాలనీ, విద్యుత్ ఉత్పత్తికి ఎంత ఖర్చయితే అంత వసూలు చేయాలనీ, విద్యుత్ రేట్లు పెంచకుంటే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ఇతర ప్రయోజనాలు మోడీ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు. విద్యుత్ సబ్సిడీలను ఎత్తేయబోమనీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను కొనసాగిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి పౌరునికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడమే తమ పరిపాలన లక్ష్యమని భట్టి విక్రమార్క చెప్పారు. అసెంబ్లీ రికార్డులను తిరగేస్తే పదేండ్లుగా ప్రతిపక్షంలో కూర్చున్న తమకు జరిగిన అవమానాలేంటో తెలుస్తుందన్నారు.

ప్రజాసమస్యలపై మాట్లాడేందుకు సరిగా మైకు కూడా ఇవ్వలేదని విమర్శించారు.



ప్రతిపక్ష సభ్యులుగా తమను గౌరవించకున్నా అర్ధరాత్రి 2 గంటల వరకు ఓపికగా విన్నామే తప్ప వెల్‌లోకి వెళ్లడంగానీ, వాకౌట్ చేయడం గానీ చేయలేదని చెప్పారు. సభ్యులు అడిగిన ప్రతి ప్రశ్నకూ క్లారిఫికేషన్ ఇస్తామన్నా వినే ఓపిక లేకుండా బీఆర్ఎస్ సభ్యులు వెళ్లిపోయారనీ, ప్రజాస్వామ్యంపై వారికున్న గౌరవమిదని విమర్శించారు. బడ్జెట్ కాగితాలను చించి చెవిలో పెట్టుకుని వెళ్లిపోవడమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబం అగాధంలోకి వెళ్లొద్దని దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.1.20 కోట్ల ప్రమాద బీమా కల్పించామని తెలిపారు. బిడ్డలు ఖాళీ కడుపుతో బడికి పోవద్దన్న ఆలోచనతో అల్పాహారం ప్రవేశపెట్టామన్నారు. ఇంటర్ పిల్లలకు మొట్టమొదటిసారి మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయబోతున్నామని చెప్పారు. రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ప్రమాద బీమా కల్పించబోతున్నామన్నారు. ఈ మంచి పథకాలు బీఆర్ఎస్ సభ్యులకు కనిపించడం లేదా? వారికి ఇవి ఇష్టం లేదా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎల్పీ నేత సభకు ఎందుకు రావడంలేదని నిలదీశారు. సమస్త తెలంగాణ ప్రజల కోసం, వారి జీవితాల్లో మార్పు కోసం సభ ఉందన్నారు. అలవికాని హామీలిచ్చారని హరీశ్‌రావు అంటున్నారనీ, వాళ్లలాగా అలవికాని హామీలు మేం ఇవ్వలేదని చెప్పారు. అలా ఇస్తే బడ్జెట్ రూ.5 లక్షల కోట్లపైగా పెట్టాల్సి ఉండేదని అన్నారు. రైతులు, ప్రజా, మహిళా సంక్షేమ కోసం రూ.50 వేల కోట్లు కేటాయించామని వివరించారు. రైతు భరోసా కోసం రూ.18 వేల కోట్లు ఖర్చుచేశామనీ, తొమ్మిది రోజుల్లో రైతుల ఖాతాల్లో తొమ్మిది వేల కోట్ల రూపాయలు వేసిన చరిత్ర తమదని గర్వంగా చెప్పారు.

రైతు భరోసా స్కీమ్‌ను ఎన్నికల స్కీమ్‌గా మార్చుకున్నది బీఆర్ఎస్ అని విమర్శించారు. హైదరాబాద్‌కు మణిహారంగా ఉన్న ఔటర్ రింగు రోడ్డును బీఆర్ఎస్ సర్కారు ఎన్నికల ముందు కుదవపెట్టింది వాస్తవం కాదా? వచ్చిన డబ్బులను రైతు బంధు పేరిట రైతుల ఖాతాల్లో జమచేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. వరి కాకుండా ఇతర పంటలు ఎవరైనా సాగు చేస్తే వారిని ప్రోత్సహించాలనే ఆలోచనతో తమ ప్రభుత్వం ఉందన్నారు. ఉచిత కరెంటు కాంగ్రెస్ పేటెంట్ అని చెప్పారు. రాష్ట్రంలో 29 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ అందించేందుకు రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. శాసనమండలిలో కూడా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సభ్యులు లేవనెత్తిన అంశాలకు సమాధానమిచ్చారు. అనంతరం ఉభయసభలు బుధవారం ఉదయం పది గంటలకు వాయిదా పడ్డాయి.

# డిజిటల్ యుగంలోనూ వార్తల ప్రసారంలో ఆకాశవాణి కీలక పాత్ర




హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: వేగంగా మార్పు చెందుతున్న డిజిటల్ యుగంలోను ఆకాశవాణి వార్తలు తమకంటూ ఒక ప్రత్యేకతను సంతరించు కున్నాయని ఆకాశవాణి డైరెక్టర్ జనరల్ రాజీవ్ కుమార్‌జైన్ అన్నారు. సంప్రదాయ రేడియో వార్తా ప్రసారంతో పాటు సోషల్ మీడియాలోనూ ప్రత్యేకత చాటుకుంటున్నదని చెప్పారు. ఆకాశవాణి హైదరాబాద్ ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదులోని కవాడీగూడ సీజీవో టవర్స్ కాన్ఫరెన్స్ హాల్లో పార్ట్‌టైమ్ కరస్పాండెంట్లు, క్యాజువల్ న్యూస్ ఎడిటర్లు, న్యూస్ రీడర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆకాశవాణి హైదరాబాద్ రీజినల్ న్యూస్ యూనిట్ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ వరీ మహేష్ అతిథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజీవ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ ఆకాశవాణి తన కరస్పాండెంట్లకు ఎప్పటికప్పుడు శిక్షణ తరగతులు నిర్వహిస్తూ వారి వత్తి మెలకువలను పెంపొందిస్తుందని అన్నారు. సోషల్ మీడియా ఒత్తిడితో వార్తలను తక్షణమే ప్రసారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడినా, విశ్వసనీయతను పోగొట్టుకోకుండా,

ఆ సవాల్‌ను అధిగమించాలని కరస్పాండెంట్లకు సూచించారు. తాము సేకరించిన సమాచారాన్ని పరిశీలించి, నిర్ధారించుకోవాల్సిన బాధ్యత కరస్పాండెంట్లపై ఉందన్నారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం వల్ల వార్తలకు నిర్వచనమే మారిపోయిందని చెప్పారు. ఆకాశవాణిలో కచ్చితత్వం, ధర్మనిష్టను పాటించాల్సిన అవసరాన్ని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్ అదనపు డైరెక్టర్ జనరల్ శతి పాటిల్ మాట్లాడుతూ వాట్సప్ యూనివర్సిటీ ద్వారా వ్యాప్తి చెందుతున్న ఫేక్ న్యూస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో పీఐబీ ప్రారంభించిన ఫ్యాక్ట్ చెక్ విభాగం గురించి వివరించారు . ప్రభుత్వ కమ్యూనికేటర్లుగా విలేకరులు క్షేత్రస్థాయి అభివద్ధి నివేదికలపై దష్టి సారించాలని సూచించారు. ఆకాశవాణి హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్, క్లస్టర్ హెడ్ హరిసింగ్ మాట్లాడుతూ ఆకాశవాణి విశ్వసనీయతకు, సమగ్రతకు, సంపూర్ణతకు మారుపేరు అని చెప్పారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుని విశ్వసనీయతను పోగొట్టుకోకుండా ఆకాశవాణి ప్రఖ్యాతిని అలాగే నిలబెట్టాలని కరస్పాండెంట్లకు సూచించారు. ఆకాశవాణి హైదరాబాద్ రీజినల్ న్యూస్ యూనిట్ హెడ్, డిప్యూటీ డైరెక్టర్ వరీ మహేష్ మాట్లాడుతూ 1957 ఫిబ్రవరి 7న ఆకాశవాణిలో వార్తా విభాగం ప్రారంభమైందని గుర్తు చేశారు. 1965లో ఉ ర్దూ శ్రోతలను దష్టిలో ఉంచుకుని ఉర్దూ బులెటిన్ ప్రారంభించినట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలు అంశాలపై సీనియర్ జర్నలిస్టులు, ప్రముఖులు శిక్షణా తరగతులు నిర్వహించారు. "మారుతున్న మీడియా వాతావరణంలో వార్తల సేకరణ, కంటెంట్ తయారీ" అనే అంశంపై ఆర్టీఐ మాజీ కమిషనర్, పీపుల్స్ పల్స్ డైరెక్టర్ ఆర్. దిలీప్ రెడ్డి అవగాహన కల్పించారు. "సోషల్ మీడియా యుగంలో కంటెంట్ వినియోగం" అనే అంశంపై హిందూ బిజినెస్ లైన్ అసోసియట్ ఎడిటర్ డాక్టర్ కూర్మనాథ్ వివరించారు. "న్యూస్ రూమ్ పరిణామం, కంటెంట్ బదిలీ, మారుతున్న కంటెంట్ మూలాల స్వభావం" అనే అంశంపై ఐ న్యూస్ సీఈఓ, చీఫ్ ఎడిటర్ ఏ కే సాగర్ విశ్లేషించారు. అలాగే, "ఫాక్ట్ చెక్, సోషల్ మీడియా హ్యాండిల్స్ మెరుగుపరచడానికి సోషల్ మీడియా టెక్నిక్స్" అనే అంశంపై ఫాక్ట్ లీ సంస్థ ఆపరేషన్స్ హెడ్ భరత్ వివరించారు.

# రైతు భరోసా నిధులను రైతులు డ్రా చేసుకునేలా పూర్తి స్వేచ్ఛనివ్వాలి: జిల్లా కలెక్టర్ రాజర్షిషా

అమృత్ తెలంగాణ అదిలాబాద్ ప్రతినిధి : రైతు భరోసా నిధులను రైతులు డ్రా చేసుకునేలా పూర్తి స్వేచ్ఛనివ్వాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా బ్యాంక్ అధికారులకు స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లీడ్ బ్యాంక్ కార్యాలయం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జిల్లా సంప్రదింపుల కమిటీ (DCC), జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (DLRC) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షత నిర్వహించారు.

ముందుగా లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్ కుమార్ జిల్లా నివేదిక వివరిస్తూ, ప్రయారిటీ సెక్టర్ డిపాజిట్ క్రింద రూ.4678.87 కోట్లు, ప్రయారిటీ సెక్టర్ అడ్వాన్సెస్ కింద రూ.7991.86 కోట్లు ఖర్చు చేయడం జరిగిందని వివరించారు.

అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి నిధుల పంపిణీలో బ్యాంకర్లు ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసే ప్రక్రియలో ఎటువంటి ఆటంకాలు సృష్టించకూడదని, రైతులు తమకు కావాల్సినప్పుడు ఆ నగదును డ్రా చేసుకునేలా పూర్తి స్వేచ్ఛనివ్వాలని బ్యాంక్ అధికారులకు స్పష్టం చేశారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆర్థిక బలోపేతానికి కొత్తగా ఏర్పడే స్వయం సహాయక సంఘాల ఖాతాలను, దివ్యాంగులు, వృద్ధులు, కిశోర బాలికల సంఘాల ఖాతాలను డిసిసిబి లోనే ప్రారంభించాలా చూడాలని సూచించారు. పర్యావరణ హిత ఇంధన వనరులను ప్రోత్సహించేందుకు 'పీఎం సూర్య ఘర్' (రూఫ్ టాప్ సోలార్), 'పీఎం కుసుమ్' పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటుకు ప్రభుత్వం దాదాపు ?78,000 వరకు సబ్సిడీ అందిస్తోందని, దీనిని బ్యాంకర్లు తమ లోన్ పోర్ట్‌ఫోలియోలో ముఖ్యమైన భాగంగా చేర్చుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునికతను పెంచేందుకు అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ద్వారా అగ్రికల్చర్ డ్రోన్ల కొనుగోలుకు 40% సబ్సిడీ, వడ్డీ రాయితీతో కూడిన రుణాలు అందించాలని బ్యాంకర్లను కోరారు. మహిళా సాధికారత కోసం ఇందిరా మహిళా శక్తి పథకం కింద టైలరింగ్, మగ్గం పని, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, జనపనార సంచుల తయారీ వంటి అంశాల్లో శిక్షణ పొందిన వారికి బ్యాంకులు ఆర్థికంగా అండగా నిలవాలని సూచించారు. భూమి




సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

రిజిస్ట్రేషన్ల సమయంలో బ్యాంక్ ఛార్జ్ ఉన్న భూములపై తలెత్తుతున్న సాంకేతిక సమస్యల పరిష్కారానికి తహసీల్దార్లతో సమన్వయం చేసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పీఎం స్వ నిధి స్ట్రీట్ వండర్స్ కు అధికంగా సహాయం చేయాలని బ్యాంకు అధికారులకు సూచించారు. పీఎంఈజీపి, పీఎం ఎఫ్ఎంబి, పీఎం విశ్వకర్మ పురోగతిపై సమీక్షించారు.

అనంతరం నాబార్డ్ రూపొందించిన 2026-27 ఆదిలాబాదు జిల్లా ఆర్థిక సంవత్సరపు 'పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్' పుస్తకాన్ని కలెక్టర్, పిఓ ఆవిష్కరించారు.

ఈ సమీక్షా సమావేశంలో ఐటిడిఏ పీఓ యువరాజ్ మర్మాట్, డిఆర్డీఓ రవీందర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మనోహర్, పశు సంవర్ధక శాఖ అధికారి రామారావు, వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్, ఆర్.బి.ఐ ఏజిఎం యశ్వంత్ సాయి, నాబార్డ్ డిడియం అబ్దుల్ రావుఫ్, TGB ఆర్ఎం గిరి నాయక్, సిఈఓ రవి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు.





బియ్యాన్ని పరిశీలిస్తున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

అమృత్ తెలంగాణ భీంపూర్ న్యూస్ మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. మంగళవారం భీంపూర్ మండలం అందర్ బంద్ గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా పాఠశాలలోని వంట గది, సరుకు నిల్వల గది, భోజన శాల, వసతి గృహాలను పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని, ఎప్పటికపుడు రిజిస్టర్ లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఆర్ఓ ప్లాంట్ నీటి నాణ్యతను క్వాలిటీ మీటర్ తో కొలిచి చూశారు. స్టోర్ రూమ్ లో బియ్యం,గుడ్ల నాణ్యతను పరిశీలించి నాణ్యత లేని వాటిని తిరిగి పంపించాలని అందేశించారు. అనంతరం RBSK వైద్య బృందం అధికారులను విద్యార్థుల ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ రమేష్, హెచ్ డబ్ల్యు ఓ జ్ఞానేశ్వర్, RBSK వైద్యులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కుస్లీ లో చలివేంద్రం ప్రారంభం



కుస్లీలో చలివేంద్రం ప్రారంభించిన సర్పంచ్ ప్రవీణ్ పటేల్

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మార్చ్ 24 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని కుస్లీ గ్రామంలో సర్పంచ్ చేతుల మీద చలివేంద్రం ప్రారంభం మండుటెండల్లో ప్రజల దాహార్తి తీర్చడానికి కుస్లీ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం సర్పంచ్ ప్రవీణ్ పటేల్, చేతుల మీదుగా ప్రారంభించడం జరిగింది.. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్య, వార్డు మెంబర్లు రాజలింగం, భోజరం పటేల్, కార్యకర్తలు గంగాధర్, రమాకాంత్, భూమేష్, రవి, పీల్డ్ అసిస్టెంట్ సంతోష్, గ్రామస్తులు పాల్గొనడం జరిగింది

# అంబేద్కర్ కూడలిలో ఘనంగా సామూహిక వందేమాతరం గీతాపాలన



సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



హాజరైన విద్యార్థిని విద్యార్థులు


అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ వందేమాతరం గీతం మన భారతీయతకు, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తికి ప్రతీక అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం స్థానిక అంబేద్కర్ కూడలిలో డా.హెచ్.వి. వజే సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వందేమాతరం గీతాపాలన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి, భారతమాత చిత్ర పటానికి పూలమాలలు వేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వందేమాతరం కేవలం ఒక గీతం మాత్రమే కాదని, అది మన భారతీయతకు, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తికి ప్రతీక అని కొనియాడారు. వికసిత్ భారత్ 2047, తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను సాధించే దిశగా అభివృద్ధి బాటలో యువత పయనించలన్నారు. వచ్చే 25 ఏళ్లలో మన దేశంతో పాటు మన రాష్ట్రం ఆర్థికంగా, సామాజికంగా అగ్రగామిగా నిలవాలంటే నేటి విద్యార్థులే కీలకమని, మంచి పౌరులుగా ఎదిగి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని యువతకు పిలుపునిచ్చారు. నేటి కాలంలో విద్యార్థులు మొబైల్ ఫోన్లకు, రీల్స్ కు బానిసలవున్నారని, ఫోన్లను కేవలం ఆన్లైన్ స్టడీ మెటీరియల్ వంటి మంచి పనులకే పరిమితం చేయాలని సూచించారు. అనవసరమైన సామాజిక మాధ్యమాలతో సమయాన్ని వృథా చేసుకోవద్దని, క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు శారీరక దృఢత్వం కోసం క్రీడలపైనా దృష్టి సారించాలని విద్యార్థులకు వివరించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అధికారులు, పట్టణ ప్రముఖులు, ప్రజలు, విద్యార్థులతో కలిసి కలెక్టర్ సామూహిక వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో వాజే సమితి సభ్యులు ప్రఫుల్ వాజే, దేవన్న ప్రఫుల్ యాదవ్, పట్టణ ప్రముఖులు సుహాసిని రెడ్డి, వేదా వ్యాస్, దేవిదాస్ దేశ్పాండే, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది, యువత, ప్రజలు. తదితరులు పాల్గొన్నారు.

# బోరంచు శ్రీకాంత్ రెడ్డిని కలిసిన నూతన కాంగ్రెస్ పార్టీ అదిలాబాద్ జిల్లా సెక్రెటరీ షేక్ ఇమామ్

### ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ లో జిల్లా సెక్రటరీ గా నియమితులైన షేక్ఇమామ్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మావల లో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తో సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అభినందనలు తెలిపిన శ్రీకాంత్ రెడ్డి షేక్ ఇమామ్ ని శాలువాతో సన్మానించి రానున్న రోజుల్లో మరింత కష్టపడి పనిచేసి మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. అలాగే ప్రజా ప్రభుత్వం రైతు భరోసా నిధులను విడుదల చేసి రైతుల కళ్ళలో సంతోషాలు నింపిందని, ఇందిరమ్మ ఇళ్ల తో పేదలకు సొంతింటి కలను సాకారం చేసిందని ఇలాంటి మరెన్నో సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి నిరంతరం తమకు ఇచ్చిన పదవికి న్యాయం చేకూర్చేలా పార్టీ పటిష్టతకుకృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అంతా కలిసికట్టుగా పనిచేసి



విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ూవీజ ఎచ్చోడ వైస్ చైర్మన్ శేషరావు, సిరికొండ సర్పంచ్ బొడ్డు దత్తు, సుంకిడి సర్పంచ్ రాథోడ్ గణపతి, సిరికొండ ఉప సర్పంచ్ తోకల రాజు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ ఇమామ్, RGPRS అధ్యక్షులు సదానందం,మాజీ సర్పంచ్ షేక్ బషీర్, ఈశ్వర్, సందీప్, రామారావు, అలాం,సీనియర్ నాయకులు శేబ్బీర్, అజగర్, లాస్మన్న, కంచం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైస్ బ్యాగ్ ఛాలెంజ్ పోస్టర్ ఆవిష్కరణ.

మెట్ పల్లి అమృత్ తెలంగాణ మార్చి 23: దేశం కోసం,దేశస్వాతంత్రం కోసం బలిదానం చేసిన భగత్ సింగ్, సుఖ్ దేవ్, రాజ్ గురు ప్రాణత్యాగానికి గుర్తుగా వారిని స్మరిస్తూ ఈరోజు బలిదాన్ దివాస్ సందర్భంగా మన ప్రాంతంలోని ఎవరు ఆకలితో బాధపడకుండా ప్రతి ఒక్కరికి ప్రతి రోజు అన్నాన్ని (అన్నదానం) అందించాలనే ఉద్దేశ్యంతో మెట్పల్లి పట్టణ RDO శ్రీ నరసింహ రావు చేతులమీదుగా రైస్ బ్యాగ్ ఛాలెంజ్ పోస్టర్ ను ఆవిష్కరించడం జరిగింది. నిరు పేదలకు, రోజు కూలీలకు, హాస్పిటల్ కు వచ్చే పేషెంట్ లకు ప్రతి ఒక్కరికి ప్రతిరోజు అన్నదానాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి కడుపునిండా భోజనం పెట్టాలనే ఉద్దేశ్యంతో రైస్ బ్యాగ్ ఛాలెంజ్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు అమ్మా చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పుల్ల శ్రీనివాస్ గారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పుల్ల జగన్, బండరీ శివ, పొన్నం శ్రీనివాస్, పారిపెల్లి హరీష్, వేముల శివ, ఉదయ్ కుమార్, తోట



అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ అండ్ బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని కలిసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

### నియోజకవర్గంలోని ప్రధానమైన రోడ్లను మంజూరు చేయాలని వినతి స్పందించిన మంత్రి రోడ్లు మంజూరు చేయాలని ఆదేశాలు

అమృత్ తెలంగాణ ఇచ్చోడ న్యూస్ ఈరోజు హైదరాబాద్ లో ఆర్ అండ్ ఒబి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో గలా ప్రధానమైన రోడ్లను మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.

1. బోథ్ పట్టణంలో బీటీ రోడ్డు మరియు సీసీ రింగ్ రోడ్డు మరియు లైటింగ్ నిర్మాణానికి రూ. 5 కోట్లు.

2. పోచ్చర ఎక్స్ రోడ్డు నుంచి బోథ్ టౌన్ వరకు ఫోర్ లైన్ తో పాటు సెంట్రల్ లైట్టింగ్ మరియు మైనర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 38 కోట్లు.

3. ఇచ్చొడ మండల కేంద్రంలో ఫోర్ లైన్ నిర్మాణంలో భాగంగా సైడ్ డ్రైన్ నిర్మాణానికి రూ. 2 కోట్లు.

మంజూరు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. తక్షణమే



స్పందించిన మంత్రి అనిల్ నీ మాట కాదనను అని వెంటనే నిధులు మంజూరు చేయాలని కి ఆదేశాలు జారీచేశారు.

# పింఛన్ పేరుతో భూమి కాజేశాడు

చిన్నకోడూరు:అమృత్ తెలంగాణ: పింఛన్ కోసమని తల్లిదండ్రులను మోసం చేసి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న సంఘటన మండల పరిధిలోని గోనెపల్లిలో చోటు చేసుకుంది. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెర్గు సిద్ధయ్యబి గాలవ్వకు ఇద్దరు కుమారులు మహేందర్, నగేష్, తో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సిద్దయ్య తన పెద్దల ద్వారా 7 ఎకరాలు భూమిని వారసత్వంగా వచ్చింది. మూడున్నర ఎకరాలు రికార్డులో ఉండగా మరో మూడున్నర ఎకరాలు రికార్డులో లేదు. చిన్న కుమారుడు నగేష్ పేరున 1 ఎకరా 11 గుంటలు, సిద్దయ్య పేరున 2 ఎకరాల 5 గుంటలు రికార్డులో ఉన్నది.జనవరి 24న చిన్న కుమారుడు నగేష్ తండ్రిని తనకు ?4 వేల రూపాయల పింఛన్ ఇప్పిస్తానని తహశీల్దార్ కార్యాలయానికి తీసుకువచ్చి



తన పేరు మీద ఉన్న భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నాడన్నారు. తన భూమిని తన చిన్న కుమారుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడన్న సంగతి నెల రోజుల తర్వాత తన బంధువుల ద్వారా తెలిసిందన్నారు. విషయం తెలిసిన రోజు చిన్నకోడూరు పోలీస్ స్టేషన్లో తనను మోసం చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఫిర్యాదు చేశామన్నారు.తన పేరు మీద ఉన్న భూమి చిన్న కొడుకు రిజిస్ట్రేషన్ చేసుకుని పెద్ద పల్లిలో జీవనం కొనసాగిస్తున్నాడన్నారు. భూమిని దక్కించుకున్న కుమారుడు పట్టించుకోక, దక్కని పెద్ద కుమారుడు పట్టించుకోక పోవడంతో కొడుకులు ఉన్న మేము దిక్కులేని వార మయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బడ్జెట్లో విద్యారంగానికి అరకొర నిధులు ఏబీవీపీ





మెట్ పల్లి అమృత్ తెలంగాణ మార్చి 23: 2026-27 సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ మెట్పల్లి పాత బస్టాండ్ శాస్త్రి విగ్రహం వద్ద అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ మెట్పల్లి శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మంగళపల్లి మారుతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిన్న జరిగినటువంటి బడ్జెట్ సమావేశాల్లో అంకెల గారడితో విద్యారంగాన్ని పూర్తిగా నీరువార్యం చేస్తూ బడ్జెట్ ప్రవేశపెట్టింది. అసెంబ్లీ సమావేశాల్లో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

3,24,234 లక్షల కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టడం జరిగింది. బడ్జెట్లో విద్యారంగానికి 26,734 కోట్లు కేటాయించడం అనేది కేవలం 7.9% నిధులు మాత్రమే కేటాయించడం సిగ్గుచేటు అని ఆరోపించారు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఎన్నికల హామీలు ఊహక అందలేనంత ఎత్తుగడలతో విద్యార్థులను నిరుద్యోగులను మభ్యపెట్టి విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామని ప్రగల్బాలు పనికి కేవలం పేపర్ల ప్రకటనలకే పరిమితం అయిపోయిందని తెలిపారు. అధికారం వచ్చిన తర్వాత గత ప్రభుత్వం వలె విద్యారంగాన్ని పూర్తిగా తుంగలో తొక్కిస్తూ ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయకుండా పేద బడవు బలహీన మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తు ను గాలికి వదిలేసి అన్యాయం చేస్తుందని అన్నారు. గురుకుల పరిస్థితి మరి అద్వానంగా తయారైందని మధ్యాహ్న భోజన పథకంలో అనేక రకాల అవకాతవకలు జరుగుతున్నాయని ద్వారా పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. పాఠశాల స్థాయి నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు అనేక రకాల ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వం మద్దు నిద్ర వేయడం లేదు. రిక్రూట్మెంట్ జాబ్ క్యాలెండర్ వుసే లేకుండా రాష్ట్ర బడ్జెట్ విద్యారంగాన్ని ఖూనీ చేసే విధంగా కుట్ర చేస్తుందని ఆరాధించారు. అలాగే యూనివర్సిటీలలో అవసరానికి తగ్గ వసతులు బోధన బోధనేతర సిబ్బంది లేని కారణంగా కొత్త కోర్సులు రాణి కారణంగా విద్యార్థులు ఉన్నత విద్యను మధ్యంతరాన వదిలేసే దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వం దిగజార్చింది. ప్రవేశపెట్టిన బడ్జెట్ను వెనక్కి తీసుకొని విద్యారంగానికి పెద్దపీటవేసే విధంగా అధిక ప్రాధాన్యత కేటాయిస్తూ 15% నిధులను కేటాయించాలని ఏబీవీపీ మెట్పల్లి శాఖ డిమాండ్ చేస్తుంది. లేనియెడల అసెంబ్లీ జరుగుతున్న సమయంలోనే నిన్ను అడ్డుకుంటామని,హెచ్చరిస్తున్నాము. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కన్వీనర్ మాడవేణి సునీల్. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంగళపల్లి మారుతి. మెట్పల్లి నగర కార్యదర్శి కలికోట ప్రణీత్. మెట్పల్లి నగర సంయుక్త కార్యదర్శి ఆర్ సాయి కుమార్. ఇబ్రహీంపట్నం మండల కో కన్వీనర్ అజయ్.రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల రాజకీయ భవితవ్యం ఎటవైపు?

## నలభై ఏళ్ల కాంగ్రెస్ ప్రయాణానికి ముగింపు?..

## జగిత్యాల రాజకీయాల్లో జీవన్ రెడ్డి కొత్త దిశ!



జగిత్యాల అమృత్ తెలంగాణ మార్చి 24: జగిత్యాల రాజకీయాల్లో మరో కీలక మలుపు ఆవిర్భవించబోతుంది. ఇది కేవలం ఒక నాయకుడి పార్టీ మార్పు కథ కాదు... నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం, నిబద్ధత, ఆశలు, అవమానాలు, మరియు ప్రాంతీయ రాజకీయాల లోతైన అంతర్గత పోరాటాల ప్రతిబింబం. మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి తీసుకోబోయే నిర్ణయం వ్యక్తిగత రాజకీయ భవిష్యత్తును మాత్రమే నిర్ణయించదు.. జగిత్యాల రాజకీయ దిశను, ఉత్తర తెలంగాణ శక్తి సమీకరణాలను, కాంగ్రెస్ మరియు బీఆర్ఎస్ మధ్య పోటీతత్వాన్ని కొత్త దశలోకి తీసుకెళ్లే శక్తి కలిగిన పరిణామం ఇది. ఈ నెల 25న బుధవారం తన కార్యకర్తలతో భారీ సమావేశం నిర్వహించి, తన రాజకీయ భవిష్యత్పై కీలక నిర్ణయం ప్రకటించనున్నారు. ఇది సాధారణ సమావేశం కాదు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్తో ముడిపడిన ఆయన రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మలుపు. పార్టీ అధిష్టానం నుంచి వచ్చిన అసంతృప్తి, స్థానిక సమీకరణాల్లో ఏర్పడిన వివక్ష -- ఇవన్నీ ఆయనను ఈ నిర్ణయానికి దారి తీశాయని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈనెల 24 మంగళవారం రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ మరియు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జీవన్ రెడ్డిని బుజ్జగించడానికి జగిత్యాలలో భేటీ అయ్యారు. అయితే, తన నిర్ణయంలో ఎలాంటి మార్పు లేదని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. అంతకుముందు రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం లు జీవన్ రెడ్డిని బుజ్జగించడానికి వచ్చినా.. తాను కాంగ్రెస్ పార్టీలో నిలువగలిగే పరిస్థితులు లేవని ఖరాఖండి గా చెప్పేశారు. ఇప్పటి పరిస్థితుల్లో కాంగ్రెస్లో కొనసాగడం కుదరదని ఆయన ఇప్పటికే బహిరంగంగా ప్రకటించారు.

### రైతు కుటుంబం నుంచి రాజకీయ శిఖరాల వరకు

1951 జనవరి 5న జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం బతికే పెల్లి గ్రామంలో జన్మించిన జీవన్ రెడ్డి సాధారణ రైతు కుటుంబ నేపథ్యం నుంచి ఎదిగారు. న్యాయవాదిగా వృత్తి ప్రారంభించిన ఆయన 1981లో పంచాయతీ సమితి అధ్యక్షుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1983లో టీడీపీ తరపున జగిత్యాల నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఎన్టీఆర్ కేబినెట్లో ఎక్సైజ్ మంత్రిగా పని చేశారు. 1984లో కాంగ్రెస్లో చేరిన తర్వాత 1989 నుంచి 2004 వరకు పలుమార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేబినెట్లో రోడ్లు ఁ భవనాల మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.

2014లో తెలంగాణ ఏర్పడిన తర్వాత ఉత్తర తెలంగాణలో కాంగ్రెస్కు ఏకైక విజయం జగిత్యాల్లోనే సాధించిన ఘనత ఆయనది. 2019లో ఎమ్మెల్సీగా కూడా ఎన్నికయ్యారు. ఆరు సార్లు ఎమ్మెల్యే, ఒకసారి ఎమ్మెల్సీ, రెండు సార్లు మంత్రి -- ఇది ఆయన రాజకీయ జీవితం సాధించిన స్థాయి. జగిత్యాల ప్రజలు "జీవనన్న"గా పిలిచే ఆయన స్థానిక సమస్యలు, రైతు అభివృద్ధి, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించిన నాయకుడిగా ప్రసిద్ధి చెందారు.

### స్థానిక అసంతృప్తి నుంచి నిర్ణయం వరకు

2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఎదుర్కొన్న జీవన్ రెడ్డి, ఆ తర్వాత బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్తో సంబంధాలు దెబ్బతిన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు, చైర్పర్సన్ ఎంపికలో తన వర్గానికి తక్కువ ప్రాధాన్యత ఇవ్వడం, పదవుల పంపకాల్లో ఏర్పడిన వివక్ష -- ఇవన్నీ ఆయనలో తీవ్ర అసంతృప్తిని కలిగించాయి. పార్టీ అధిష్టానానికి పలుమార్లు తన అభ్యంతరాలు తెలిపినా సమాధానం లభించకపోవడంతో ఆయన తన రాజకీయ భవిష్యత్పై పునరాలోచన చేశారు. గత 20 నెలలుగా తాను మానసిక క్షోభ, అవమానాలు భరిస్తున్నట్లు ఆయన ఇటీవలే బహిరంగ లేఖలో వెల్లడించారు. ఇప్పుడు ఆయన కార్యకర్తల సమావేశంలో తీసుకోనున్న నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. కొన్ని రిపోర్టుల ప్రకారం ఆయన బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని, మరికొన్ని వర్గాలు ఇతర ఎంపికలను కూడా చర్చిస్తున్నట్లు తెలిపారు. ఆయన అనుచరులు ఇప్పటికే సోషల్ మీడియా డీపీలు మార్చుకోవడం, ఇంటి వద్ద ఫ్లెక్సీలు చించేయడం వంటి సంకేతాలు ఇస్తున్నాయి.

### రాజకీయ పరిణామాలు ఏమిటి?

జీవన్ రెడ్డి నిర్ణయం కాంగ్రెస్కు ఉత్తర తెలంగాణలో మరో ఎదురుదెబ్బగా మారే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే అంతర్గత అసంతృప్తులతో మల్లగుల్లాలుపడుతోంది. మరోవైపు బీఆర్ఎస్కు ఇది జగిత్యాలలో కొత్త బలం కలిగించే అవకాశం. కానీ రాజకీయ మార్పులు ఎప్పుడూ ఊహించని ట్విస్టులను తీసుకొస్తాయి. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత ఏ పార్టీలోకి వెళ్లినా, జగిత్యాల సమీకరణాలు పూర్తిగా మారిపోతాయి. మార్చి 25న జరగబోయే కార్యకర్తల సమావేశం ఒక నిర్ణయం ప్రకటించే వేదిక మాత్రమే కాదు.. ఇది తెలంగాణ రాజకీయాల్లో విలువల రాజకీయాలు వర్సెస్ అవకాశవాద రాజకీయాల మధ్య జరుగుతున్న మౌన పోరాటానికి ప్రతీకగా నిలుస్తుంది. ఒక వైపు నలభై ఏళ్ల విశ్వాసానికి ముగింపు పలకాల్సిన పరిస్థితి, మరోవైపు భవిష్యత్లో ప్రభావాన్ని నిలబెట్టుకోవాలనే రాజకీయ అవసరం, ఈ రెండు దారుల మధ్య నిల్చున్న జీవన్ రెడ్డి ఎంచుకునే మార్గం కేవలం ఆయనకే కాదు, ఆయనను నమ్ముకున్న వేలాది కార్యకర్తలకు, జగిత్యాల ప్రజలకు, మరియు మొత్తం రాష్ట్ర రాజకీయాలకు దిశానిర్దేశం చేసే తీర్పుగా మారబోతోంది. ఈ పరిణామం ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది.. పార్టీలు మారినా, నాయకులు మారినా, ప్రజల ఆశలు మాత్రం మారవు. నాయకుల వ్యక్తిగత నిర్ణయాలు కంటే పెద్దది ప్రజల నమ్మకం. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునే మార్గమే నిజమైన రాజకీయ విజయానికి ప్రమాణం. ఇక జీవన్ రెడ్డి తీసుకునే అడుగు.. చరిత్రలో ఒక అధ్యాయం ముగింపా? లేక కొత్త అధ్యాయం ఆరంభమా?.. అన్నది మరికొన్ని గంటల్లో స్పష్టమవుతుంది.

# ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వెల్దండ:అమృత్ తెలంగాణ: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఆరోగ్య మిషన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రజలు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె.రవికుమార్, వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ అన్నారు. మంగళవారం వెల్దండ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని వెల్దండ గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ క్యాంపు ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి, రోగులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. జిల్లా ఆసుపత్రి నుంచి వచ్చిన స్త్రీరోగ నిపుణులు, శిశు వైద్యులు, ఎముకల వైద్యులు, కంటి వైద్యులు, దంత వైద్యులు, జనరల్ ఫిజీషియన్లు పాల్గొని వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్స, మందులను అందించారు. దీని ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు వారి గ్రామాల వద్దే అందుబాటులోకి వస్తున్నాయని వారు పేర్కొన్నారు.

ప్రపంచ క్షయవ్యాధి నియంత్రణ దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం రెండో దశలో భాగంగా, 14 సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికీ ఎదీ స్క్రీనింగ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. టిబి లక్షణాలు ఉన్నవారు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని, సమయానికి చికిత్స తీసుకుంటే టిబి పూర్తిగా నయం అవుతుందని వివరించారు. ప్రజల్లో టిబి పై అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని, టిబి వ్యాధి నిర్మూలనలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమాజం మొత్తం కలిసి పనిచేస్తేనే టిబిని పూర్తిగా నిర్మూలించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. భీమానాయక్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీ వైద్య బృందం డా.సమీరా, డా. ప్రమోద్, డా.సాయితేజ, డా.లత,డా.స్ఫూర్తి, డా.ఖదీర్ స్థానిక వైద్యాధికారి డా.సింధు, పర్యవేక్షణ అధికారులు మురళీకృష్ణ, మనోజ్,కవిత, సుమిత, ప్రమోద్, డిస్ట్రిక్ట్ వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్,ఉప సర్పంచ్ ఎర్ర.శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ క్యాసరపు వెంకటయ్య, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీధర్, పంచాయితీ కార్యదర్శి గిరి గౌడ్, బయ్య మల్లయ్య, వార్డు సభ్యులు పాలాది మల్లీశ్వరి రంగనాథం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి పేరిట దళితులను అనగదొక్కుతున్న మొగిలిపేట అగ్రకులాలు

**వంతుల రూపంలో జరగాల్సిన పెత్తనం, దళితుల వంతు వచ్చే సరికి ఓటింగ్ తెస్తున్నారు .**

**విడిసిలను అరికట్టలేని న్యాయ వ్యవస్థ.**

**మేము కూడా డబ్బులు ఇస్తున్నామంటూ ప్రశ్నిస్తున్న నిమ్న కులాలు.**

మల్లాపూర్ అమృత్ తెలంగాణ మార్చి24, జగిత్యాల జిల్లా, మల్లాపూర్ మండలం,మొగిలిపేట గ్రామంలో అభివృద్ధి పేరిట విడిసి అనే ఒక రాజ్యాంగ వ్యతిరేక సంస్థ ఏర్పాటు చేసి మేమే పెత్తనం చేస్తామంటూ ,దళితులకు ఏ అవకాశం లేకుండా పెద్ద మనుషుల అవతారం ఎత్తి పూజలు చేస్తున్నారు .దళితులపై ఇంత వివక్ష జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.రాజ్యాంగ బద్ధమైన ఎన్నికలు ఎదుర్కొనే సత్తాలేని కొందరు విడిసి అనే సంస్థని ఏర్పాటు చేసి ప్రతి ఏడాది మేమే అంటూ పెత్తనం చేస్తున్నారు. దళితులపై వివక్ష చూపడం అంటే గుడిలోకి రానియ్యక పోవడం మాత్రమే కాదు. వారికి చెందాల్సిన ,రావాల్సిన హక్కుల్ని హరించడమే అవుతుందని కూడా కనీసం వారికి తెలియదు గ్రామాభివృద్ధి పేరిట అక్రమ టెండర్లు నిర్వహించడం తప్పితే వీరు చేయగలిగిందేమీ లేదనీ ప్రజలు భావిస్తున్నారు అధికారులు , పోలీసు వ్యవస్థ దీన్ని ఎప్పుడు పట్టించుకుంటారు, ఒకరినొకరు కొట్టుకుచచ్చిన తర్వాత పట్టించుకుంటారేమో చూడాలి. మేము కూడ డబ్బులిస్తున్నాం మేమెందుకు చేయకూడదు పెత్తనం వంతుల వారీగా చేయాలి కదా అనేది దళితుల వాదన , లేదు లేదు మేమే చేస్తాం మాకింద పని చేయాలనేది అగ్రకులాల అభిప్రాయం.

ఇలా జరుగుతుందని ఏడాది కాలంగా పేపర్లలో వస్తున్న అధికారులు ,పోలీసు వ్యవస్థ పట్టించుకోవడం లేదు. ఈ పద్ధతి మారకపోతే హెచ్ఆర్సి కి వెళ్తామని దళితులు హెచ్చరిస్తున్నారు.

# "జాతీయ మెగా లోక్ అదాలత్ లో కేసులను పరిష్కరించుకోండి: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్"



జగిత్యాల అమృత్ తెలంగాణ మార్చి 24: ఈ నెల 28 న నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా, రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో,పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ గారు సూచించారు.ఈ లోక్ అదాలత్లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన నిర్వహణ కేసులు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు మరియు ఇతర రాజీ పడదగిన కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు.రాజీ మార్గమే రాజమార్గమని, జుడిషియల్ శాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్లు మరియు ఇతర సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిరేలా అవగాహన కల్పిస్తారని తెలిపారు.కాబట్టి తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని భావించే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంపాదించాలని అన్నారు.

# ముఫ్త్ బిజిలి యోజన ద్వారా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




అమృత్ తెలంగాణ మంచిర్యాల ప్రతినిధి మార్చి 24, 2026: ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా దేశవ్యాప్తంగా 1 కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చి విద్యుత్ బిల్లులను తగ్గించడమే లక్ష్యంగా సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన ప్రచార వాహనాన్ని రెడ్ కో ఆదిలాబాద్ డి.ఎం. ఎల్. శ్రీనివాస్, టి జి ఎన్ పి డి సి ఎల్ ఎస్.ఈ. రాజన్న ఇతర అధికారులతో కలిసి ప్రారంభించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇండ్ల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ను ఏర్పాటు చేసుకుని ప్రతి నెల 360 యూనిట్ల వరకు విద్యుత్ పొందవచ్చని తెలిపారు. దేశవ్యాప్తంగా 1 కోటి కుటుంబాలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా పథకం అమలు చేయడం జరుగుతుందని, 1 కిలో వాట్ కు 30 వేల రూపాయలు, 2 కిలోవాట్లకు 60 వేల రూపాయల రాయితీ కాగా 18 వేల రూపాయల వరకు ప్రతి కిలోవాట్ కు, జి.హెచ్.ఎస్./ ఆర్.డబ్ల్యూ.ఎ. (సాధారణ సౌకర్యాలు, ఈ.వి. చార్జింగ్) కోసం 500 కిలోవాట్ల వరకు రాయితీ అందుబాటులో ఉంటుందని, 3 కిలోవాట్లు అంతకంటే ఎక్కువ విద్యుత్తుకు 78 వేల రూపాయలు కాగా రాయితీ మొత్తం నేరుగా వినియోగదారుల బ్యాంకు ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. సోలార్ ద్వారా నెలవారి వినియోగం, విద్యుత్ బిల్లులు, కాలుష్యం తగ్గించుకోవచ్చని, మిగులు విద్యుత్ ను గ్రిడ్ కు సరఫరా చేస్తే నెట్ మీటరింగ్ ద్వారా డిస్కం నుంచి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. గృహ విద్యుత్ కనెక్షన్ ఉన్న వినియోగదారులు, సోలార్ కు అనుకూలమైన సొంత రూఫ్ టాప్ కలిగి గతంలో సోలార్ రాయితీ పొంది ఉండకూడదని తెలిపారు. జాతీయ పోర్టల్ ద్వారా www.pmsuryaghar.gov.in లో,హొహొఅధికృత వెండర్ల ఎంపిక, దరఖాస్తు ట్రాకింగ్ చేసుకోవచ్చని, 3 కిలోవాట్ల వరకు సోలార్ వ్యవస్థకు షూరిటీ అవసరంలేని వడ్డీ రుణ సదుపాయం కల్పించబడుతుందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డి.ఈ. - మంచిర్యాల డి.మల్లేశం, ఎ డి ఈ - కమర్షియల్ జి. మోహన్ రెడ్డి, ఎ డి ఈ - మంచిర్యాల రూరల్ రాజశేఖర్, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



అమృత్ తెలంగాణ మంచిర్యాల ప్రతినిధి మార్చి 24, 2026: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని తాండూర్ మండల కేంద్రంలో, కిష్టంపేట గ్రామపంచాయతీ పరిధిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలు భాగంగా కొనసాగుతున్న పారిశుధ్యం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గ్రామంలోని అంతర్గత రహదారులు, మురుగు కాలువ వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి 10 రోజులకు ఒకసారి శుభ్రపరచాలని, మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.హొఇందిరమ్మ ఇండ్లు పథకాల అమలు తీరును పరిశీలించి లబ్ధిదారులు నిబంధనల ప్రకారం ఇండ్లు త్వరగా నిర్మించుకునేలా అధికారులు పర్యవేక్షించాలని, ఇసుక కొరత లేకుండా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలోని నర్సరీని సందర్శించి వేసవిలో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, సకాలంలో నీటిని అందించి మొక్కలను పరిరక్షించాలని తెలిపారు. వీధి దీపాలు పగలు వెలుగకుండా అధికారులు పర్యవేక్షించాలని, విద్యుత్తును దుర్వినియోగం చేయకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ జ్యోత్స్న, డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్ కుమార్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం...

**ఈ నెల 28 న జాతీయ లోక్ అదాలత్**

**జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు తక్షణ న్యాయం**

**కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ విజ్ఞప్తి**

అమృత్ తెలంగాణ నిర్మల్ న్యూస్ చాలా మంది ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగ పరచుకోవాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కక్షిదారులు కోర్టు పరిధిలో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.చాలా మంది ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన , తక్కువ ఖర్చుతో పరిష్కరించడానికి భారత ప్రభుత్వం నిర్వహిస్తున్నహాౌజాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగపరచుకోవాలని జిల్లా ఎస్పీ తెలపడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...

ఈ నెల 28 న జరిగే.. జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలియ జేశారు.ఇందులో చిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు , సివిల్ డిస్ప్యూట్లు వంటి వివాదాలు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చని తెలిపారు.ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,న్యాయ స్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవచ్చున్నారు.అంతేకాకుండా, ఇది ఒక శాంతియుత పరిష్కార విధానం కావున, ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. కోర్టు లో గల కేసులలో త్వరగా పరిష్కారం చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని లిజిల్లా ఎస్పీ తెలిపారు.



నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల


## సోనాలా మండల హెడ్క్వాటర్ లో పూజ మరియు విగ్రహా ఆవిష్కరణ కు సిద్దంగా ఉన్న విశ్వ బంజారా ధర్మ గురు రామారావు మహారాజ్ విగ్రహం.



అమృత్ తెలంగాణ సోనాల మండల్ న్యూస్ సోనాలా మండల హెడ్క్వాటర్ లో పూజ మరియు విగ్రహా ఆవిష్కరణ కు సిద్దంగా ఉన్న విశ్వ బంజారా ధర్మ గురు రామారావు మహారాజ్ విగ్రహం. విగ్రహా నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేస్తున్న బోథ్ మాజీ వీప్రా తులా శ్రీనివాస్, రామ్ రావు సేవాలాల్ ఆశయ సాధన సమితి ధర్మ ప్రచారక్ ఆడే వసంత్ రావు మరియు ధరమ్ సోత్ అంబాజీ . అలాగే వివిధ గ్రామాల ముఖ్యులు మాజీ సర్పంచ్ జాదవ్ రాంకిషన్ నాయక్, సర్పంచ్ బాబూసింగ్, సర్పంచ్ నానాజీ, సక్కరామ్ నాయక్, రోహిదాష్, దశరథ్, రిటైర్డ్ పి జి హెచ్ ఎం గుండెరావు, రిటైర్డ్ టీచర్ జాలం సింగ్ మరియు సోనాలా పరిసర గ్రామ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించాలి

వనపర్తి:అమృత్ తెలంగాణ: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచే విధంగా వైద్య అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ తన చాంబర్‌లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ 'మిషన్ మధుమేహ దృష్టి' కార్యక్రమం పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. అధికారులు ఇప్పటివరకు 12,000 మందికి పైగా ప్రజలకు స్క్రీనింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వేగవంతం చేసి ఏప్రిల్ నెలాఖరులోపు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాల ద్వారా కంటి, దంత సమస్యలు ఉన్న పిల్లలకు తగిన చికిత్స అందించాలని సూచించారు. జిల్లాలో ప్రతి గర్భిణి మహిళను తప్పనిసరిగా నమోదు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల మెరుగుదలకు అవసరమైన సదుపాయాల కోసం సహకారం అందిస్తామని



వైద్యులు మరింత కృషి చేసి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఎంహెచ్వో సాయినాథ్ రెడ్డి, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ, ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## సినిమా సినిమాకీ లాంగ్ గ్యాప్.. రీజన్ చెప్పిన మృణాల్



మొదట బుల్లితెరపై సందడి చేసిన ఈ నార్త్ భామ తర్వాత మెల్లిగా సినిమాల్లోకి వచ్చి వెండితెరపై కనిపించింది. ఏదైనా దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకోవాలంటారు పెద్దలు. అలా కాకుండా అంతా అయిపోయాక ఎంత చక్కబెట్టాలన్నా మొత్తం శూన్యంలానే కనిపిస్తుంది. ఇప్పుడు హీరోయిన్ మృణాల్ ఠాకూర్ ది కూడా అదే సిట్యుయేషన్. మొదట బుల్లితెరపై సందడి చేసిన ఈ నార్త్ భామ తర్వాత మెల్లిగా సినిమాల్లోకి వచ్చి వెండితెరపై కనిపించింది. అయితే మృణాల్ తన సినీ జీవితాన్ని ముందుగా మొదలుపెట్టింది మరాఠీ సినిమాలతో. ఆ తర్వాత బాలీవుడ్ కు వెళ్లి అక్కడ పలు హిందీ సినిమాల్లో నటించింది. కానీ తన శ్రమకు తగ్గ ఫలితాన్ని మాత్రం మృణాల్ బాలీవుడ్ లో అందుకోలేక పోయింది. సరిగ్గా అదే టైమ్ లో మృణాల్ కు తెలుగులో సీతారామం సినిమాలో నటించే అవకాశం దక్కింది. సీతారామంలో దుల్కర్ సల్మాన్ సరసన సీత పాత్రలో నటించిన మృణాల్ ఒక్క సినిమాతోనే టాలీవుడ్ ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. తన నటనతో అందరినీ మెప్పించి వావ్ అనిపించింది. దానికి తగ్గట్టే ఆ సినిమా కూడా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. సీతారామం తర్వాత మృణాల్ కు తెలుగులో వరుస పెట్టి అవకాశాలు వచ్చాయి. దీంతో ఇక మృణాల్ మళ్లీ వేరే ఇండస్ట్రీ వైపు చూసింది లేదు. రెండో సినిమాగా నాని తో చేసిన హాయ్ నాన్న సినిమా కూడా సూపర్ హిట్ అయింది. అదే టైమ్ లో మృణాల్ కు కోలీవుడ్ నుంచి శివ కార్తికేయన్ కు జంటగా ఏ ఆర్ మురుగదాస్ దర్శకత్వంలో ఓ సినిమా ఛాన్స్ వచ్చింది. కారణాలేంటో తెలీదు కానీ మృణాల్ మాత్రం ఆ అవకాశాన్ని వద్దనుకుంది. . మిడ్ నైట్ 2.30కి షాక్ ఇచ్చిన పాకిస్థానీ! కోలీవుడ్ ఛాన్స్ వద్దనుకుని అదే టైమ్ లో మృణాల్ టాలీవుడ్ లో చేసిన ఫ్యామిలీ స్టార్ సినిమా డిజాస్టర్ అయింది. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు మృణాల్ కు కోలీవుడ్ నుంచి మరో ఆఫర్ వచ్చింది లేదు. గ్లామర్ విషయంలో ఎలాంటి కండిషన్స్ పెట్టకపోయినా అమ్మడికి సినిమా అవకాశాలు తగ్గాయనేది మాత్రం వాస్తవం. అయితే రీసెంట్ గా మృణాల్ ను ఎందుకు ఎక్కువ సినిమాలు చేయడం లేదని అడగ్గా, తను చేస్తున్న పాత్రలను ఆడియన్స్ ఆదరిస్తున్నారని అందుకే పాత్రల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తున్నట్టు మృణాల్ తెలిపింది.

## మాళవిక ప్లేస్ కొట్టేసిన శృతి హాసన్..?

ప్రభాస్ రాజా సాబ్ సినిమా మీద చాలా ఆశలు పెట్టుకున్న అమ్మడు ఆ సినిమాతో తన రేంజ్ పెరుగుతుందనే ఆలోచనలో ఉంది. మలయాళ భామ మాళవిక మోహనన్ త్వరలో రాజా సాబ్ తో తెలుగు ఎంట్రీ ఇస్తుంది. ఐతే డైరెక్ట్ తెలుగు సినిమా చేయలేదు కానీ మాస్టర్ తో అమ్మడు తెలుగు ఆడియన్స్ ముందుకు వచ్చింది. తమిళ్ లో ఇప్పటికే ఆడియన్స్ ని అలరిస్తున్న మాళవిక తెలుగు ఆడియన్స్ మనసులు గెలుచుకోవాలని చూస్తుంది. ప్రభాస్ రాజా సాబ్ సినిమా మీద చాలా ఆశలు పెట్టుకున్న అమ్మడు ఆ సినిమాతో తన రేంజ్ పెరుగుతుందనే ఆలోచనలో ఉంది. ఇదిలాఉంటే లోకేష్ కనకరాజ్ తో మాస్టర్ సినిమా చేసిన మాళవిక ఆ టైం లోనే కూలీ సినిమా గురించి డిస్కషన్ వచ్చిందట. రజనీ కూతురిగా ముందు తననే అనుకున్నారని కాకపోతే ఆ ఛాన్స్ మిస్ అయ్యిందని అంటుంది మాళవిక. ప్రస్తుతం లోకేష్ కనకరాజ్ సూపర్ స్టార్ రజినీతో కూలీ సినిమా చేస్తున్నారు. ఆ సినిమాలో శృతి హాసన్ ఫిమేల్ లీడ్ గా నటుస్తుంది. రజిని కూతురిగా ఈ సినిమాలో శృతి హాసన్ కనిపిస్తుందని తెలుస్తుంది. ఐతే లోకేష్ ఈ పాత్ర కోసం



ముందు మాళవికని అనుకున్నారని తెలుస్తుంది. ఐతే మరి ఆమెను ఎందుకు వద్దనుకున్నారో ఏమో కానీ మాళవిక ప్లేస్ లో శృతి హాసన్ వచ్చి చేరింది. ఐతే శృతి హాసన్ ఈమధ్యనే లోకేష్ కనకరాజ్ తో ఒక వీడియో సాంగ్ చేసింది. ఆ కాంబినేషన్ సెట్ అవ్వడం వల్ల ఈ ఛాన్స్ వచ్చి ఉండొచ్చని అంటున్నారు. ఈమధ్య శృతి హాసన్ తన దాకా వచ్చిన ఛాన్స్ లను వదిలేస్తుంది. అడివి శేష్ తో డెకాయిట్ సినిమా ముందు శృతి హాసన్ నే హీరోయిన్ గా ఫిక్స్ చేయగా మధ్యలో ఏమైందో ఏమో కానీ ఆమె ప్లేస్ లో మృణల్ ఠాకూర్ ని తీసుకున్నారు. లాస్ట్ ఇయర్ ప్రభాస్ తో సలార్ 1 సినిమా చేసిన అమ్మడు నెక్స్ట్ తెలుగు సినిమా ఏది ఓకే చేయలేదు. తమిళ్ లో కూడా శృతి హాసన్ కేవలం కూలీ ఒక్కటే చేస్తుంది. అక్కడ మాళవిక ప్లేస్ లో శృతి హాసన్ వస్తే.. ఇక్కడ శృతి ప్లేస్ లో మృణాల్ వచ్చింది. మరి శృతి కెరీర్ మీద అంత ఫోకస్ గా లేదన్న టాక్ ఎప్పటినుంచో వినిపిస్తుంది. అంతకుముందు ఏమో కానీ ఇప్పుడు కొత్త హీరోయిన్స్ చాలామంది ఆప్షన్స్ ఉన్నారు కాబట్టి ఆమెను లైట్ తీసుకునే ఛాన్స్ ఉంటుంది.

## సలీం కోసం అనార్ వెయిటింగ్

తాజాగా షామా షేర్ చేసిన ట్రెడిషనల్ శారీ లుక్ ఇంటర్నెట్ ని మరిగిస్తోంది. షామా శికందర్ పరిచయం అవసరం లేదు. వరస ఫోటోషూట్‌లతో అగ్గి రాజేస్తున్న ఈ బ్యూటీ బోల్డ్ / డస్కీ లుక్స్ తో హృదయాల్ని టచ్ చేస్తుంది. తాజాగా షామా షేర్ చేసిన ట్రెడిషనల్ శారీ లుక్ ఇంటర్నెట్ ని మరిగిస్తోంది. చీరలో షామా ముగ్ధ మనోహర రూపానికి యూత్ ఫిదా అయిపోతోంది. షామా ఈ కొత్త లుక్ లో సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. దేవదాస్ కోసం ఎదురు చూస్తున్న పార్వతిలా.. సలీం కోసం వెయిటింగ్ లో ఉన్న అనార్ లాగా కనిపిస్తోందంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. సింపుల్ శారీకి డిజైనర్ బ్లౌజ్ కాంబినేషన్ పర్ఫెక్ట్ ఫిట్ గా కనిపిస్తోంది. చేతిలో కలువ రేకు బూరె బుగ్గను తాకుతుంటే యథాలాపంగా ఏదో ఆలోచిస్తూ కనిపించింది. షామా ట్రెడిషనల్ లుక్ కి బంగారు వర్ణం డిజైనర్ పరికిణీ, చెవులకు ఆ పొడవాటి జూకా అదనపు ఆకర్షణగా మారింది. ఈ లుక్ చూడగానే విరహంతో వీగిపోతున్న రాణిలా కనిపిస్తోందంటూ కొందరు అభిమానులు పొగిడేస్తున్నారు. యే మేరీ లైఫ్ హై ఫేమ్.. నటి షామా.. జేమ్స్ మిల్లిరోన్ తో రొమాంటిక్ డేట్ లో ఉన్న సంగతి తెలిసిందే. డేటింగ్ వ్యవహారం ఎలా ఉన్నా కానీ, షామా ఇప్పటికీ బాలీవుడ్ లో అవకాశాల కోసం వేటను ఆపలేదు. సౌత్ సినీపరిశ్రమలపైనా దృష్టి సారించిందని కథనాలొచ్చాయి.



## దిశా పటానీ బిగ్ బ్లో..



షాకవ్వాలంతే ఇదిగో ఇక్కడ దిశా పటానీ లేటెస్ట్ ట్రెండీలుక్ తో కుర్రకారు హృదయాల్లో గిలిగింతలు పెడుతోంది. ట్రెడిషనల్ లెహంగా.. ఇంకేవైనా.. దుస్తులు ఏవి? అనేది ముఖ్యం కాదు. వాటిని ప్రదర్శిస్తున్నది ఎవరు? అనేదే ముఖ్యం. కొందరు డ్రెస్ తొడిగితే ఆ డ్రెస్ కే అందం వస్తుంది. ఇదే కేటగిరీకి చెందుతుంది దిశా పటానీ. ఇదిగో ఇక్కడ దిశా పటానీ లేటెస్ట్ ట్రెండీలుక్ తో కుర్రకారు హృదయాల్లో గిలిగింతలు పెడుతోంది. అంటూ ఎల్లే ఇండియా – ది ఎల్లే లిస్ట్ 2024 పేరుతో రిలీజ్ చేసిన ఈ స్పెషల్ ఫోటోషూట్ కుర్రకారు వాట్సాప్ లలో వైరల్ గా మారుతోందంటే దానిలో ఎంత ఎలివేషన్ కనిపిస్తోందో అర్థం చేసుకోవాలి. పటానీ ఎంపిక చేసుకున్న డిజైనర్ డ్రెస్ లో ఎంతో హాలి గా కనిపిస్తోంది. ముఖ్యంగా తన అందాలను ఎలివేట్ చేయడంలో ఈ డ్రెస్ అద్భుతంగా సెట్టయిందని చెప్పాలి కెరీర్ మ్యాటర్ కి వస్తే .. ఇటీవల కల్కి 2898 ఏడి చిత్రంలో కనిపించింది దిశా పటానీ. తదుపరి సీక్వెల్ లోను కనిపించనుంది. మరోవైపు వెల్ కం టు ది జంగిల్ లాంటి భారీ మల్టీస్టారర్ చిత్రంలోను దిశా నటిస్తోంది. ఇవేగాక, తన తదుపరి చిత్రాల గురించి అప్ డేట్ చెప్పాల్సి ఉంది.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com